క్లుప్తంగా

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం : విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటే సమాజంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని ఎస్ఐ భారతి తెలిపారు. గురువారం బలిజకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మనోహర్‌నాయుడు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్ఐ భారతి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవకుండా ఇష్టపడి చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి పదోరగతి పబ్లిక్ పరీక్ష ప్రారంభం కానున్నాయని తెలిపారు. పరీక్షల్లో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా రాయాలన్నారు. మంచి మార్కులతో ఉతీర్ణత సాధించేలా కష్టపడి చదవాలని సూచించారు. పాఠశాల స్థల దాత మునిరత్నంనాయుడు సొంత ఖర్చుతో విద్యార్థులకు పరీక్ష రాయడానికి కావాల్సిన ప్యాడ్‌లు, పెన్ను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శలు అలరించారు. కార్యక్రమంలో టీచర్లు రమేష్, గోవర్ధన్, రఘు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ హైస్కూల్ ప్లస్ వార్షికోత్సవం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్ ప్లస్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచ్

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె సచివాలయంలో గురువారం మారేపల్లె పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను స్థానిక సర్పంచ్ అన్నురాశి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నురాశి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను నేరుగా ఇంటికే అందించాలన్న ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థ సత్ఫలితాలను ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీడీఓ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో బయోచార్ ప్రాజెక్టు ప్రారంభం

గంగాధర నెల్లూరు: వాతావరణంలోని కార్బన్‌ను నాణ్యమైన ఎరువు (బయోచార్)గా మార్చడానికి జైన్ ఇరిగేషన్, జైన్ ఫామ్ ఫ్రెష్ ఆధ్వర్యంలో నూతన ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానున్నదని ఆ కర్మాగారం మేనేజర్ షమీర్ శర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వాతావరణంలోని కార్బన్‌ను బయోచార్(నాణ్యమైన ఎరువు)గా మార్చే ప్రాజెక్టు ద్వారా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పంట కోత అనంతరం పంట పొలాల్లోని అవశేషాలు కాల్చడం తగ్గుతుందని, వ్యర్థాలు స్థిరంగా పారవేయడం కూడా తగ్గుతుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఆసక్తి గల ఉద్యోగులు, స్థానికులు, పౌరులు డీలర్లు సరఫరాదారులు పర్యావరణ వ్యవసాయ నియంత్రణ అధికారులు మార్చి 23న జైన్ ప్రధాన కార్యాలయం జల్గావ్‌లో నిర్వహించనున్న సమావేశంలో హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

పాలసముద్రం : మండలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం జరిగిన రెండో సంవత్సరం కెమిస్ట్రీ పరీక్షకు 75 మంది హాజరుకావాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బాబు తెలిపారు. ఆఖరి రోజు ఉదయం 8 గంటలకు అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు నడుమ కళాశాలకు తీసుకొచ్చి. పరీక్ష ప్రారంభించారు. అన్ని పరీక్షలు చక్కగా రాశామని విద్యార్థులు చివరి రోజు ఒకరిపై ఒక్కరు ఇంకులు చల్లుకుని ఉల్లాసంగా పరీక్ష కేంద్రం నుంచి వచ్చారు.

నిజాయితీ చాటుకున్న కల్యాణ కట్ట సిబ్బంది

తిరుమల: భక్తుడు పోగొట్టుకున్న బంగారు గొలుసును తిరిగి అప్పగించి కల్యాణకట్ట సిబ్బంది గురువారం నిజాయితీని చాటుకున్నారు. ఉదయం ఓ భక్తుడు మాధవ నిలయంలో తలనీలాలు సమర్పించాడు. గుండు శుభ్రం చేసుకుంటుండగా రూ.2 లక్షల విలువ చేసే చైన్ పోగొట్టుకున్నాడు. ఎంత వెతికినా అక్కడ దొరకలేదు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కల్యాణకట్ట ప్రధాన కార్యదర్శి వంకిపురం పవన్‌కు గొలుసు దొరకడంతో టీటీడీ వీజీఓకి అప్పగించాడు. వెంటనే భక్తుడు తన గొలుసుకు సంబంధించి ఆనవాళ్లు చెప్పడంతో వీజీఓ నందకిషోర్, ఏవీఎస్ శైలేంద్ర ఆధ్వర్యంలో అతనికి అప్పగించారు. ఈ సందర్భంగా భక్తుడు టీటీడీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



సచివాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఆర్‌కే రోజా



గజమాలతో మంత్రిని సత్కరిస్తున్న అడవికొత్తూరు గ్రామస్తులు

- కష్ట సమయంలో రానివారు ఇప్పుడెందుకు వస్తున్నారో ఆలోచించండి ?
- జనం బాగుకోరే నాయకుడు సీఎం జగనన్న మాత్రమే
- వచ్చే ఎన్నికలు అత్యంత కీలకం.. సంక్షేమం కావాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- ప్రజల కోసం పాటుపడే జగనన్నకు, పెత్తందార్లకు మధ్యే ఈ ఎన్నికలు
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి : నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూడండి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించండి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం ఆమె నగరి మండలంలోని అడవికొత్తూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, తుడా నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన కాలువను ప్రారంభించారు. అనంతరం రూ.20 లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో ఎన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి ? ఎంతమందికి సంక్షేమం అందుతోంది అనేది ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ఒక్క అడవికొత్తూరు సచివాలయ పరిధిలోనే డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.14.76 కోట్లు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. జరిగిన ప్రతి అభివృద్ధి గణాంకాలతో సహా చూపడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్యం, గూడు వంటివి ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అందుతున్నాయని చెప్పారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.4.25 లక్షల కోట్లు అందించడం జరిగిందన్నారు. ఇదే రాష్ట్రాన్ని గతంలో పాలించిన చంద్రబాబు ఇన్ని అభివృద్ధి పనులు ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ? మంచి మనసున్న నాయకుడు జగనన్న పాలిస్తేనే రాష్ట్రంలో ఇన్ని పనులు జరిగాయని తెలిపారు. ఒక పేద మహిళ సొంతిల్లు వచ్చిందని ఆనందపడితే తట్టుకోలేక పొట్టన పెట్టుకున్న పార్టీలు టీడీపీ, జనసేన అన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రజలు అల్లాడుతుంటే కనిపించని టీడీపీ, జనసేన నాయకులు నేడు గడప గడపకు పరుగులు తీస్తున్నారంటే అది ఎందుకో ప్రజలు ఆలోచించాలన్నారు. ఆపద అని తెలిసినా వచ్చి సేవలందించిన వారు ప్రజల కోసం వచ్చిన వారని, ఓటు కోసమే వచ్చిన వారు స్వలాభం కోసం వస్తున్నారనే విషయం తెలియని అమాయకపు ప్రజలు లేరన్నారు. సంక్షేమం, అభివృద్ధిని పేద వాడి గడప వద్దకే చేర్చిన జగనన్నకు.. మాటల్లో కోటలు కట్టే పచ్చబ్యాచ్‌కు మధ్య జరిగే యుద్ధమే ఈ ఎన్నికలు అన్నారు. ప్రజల కోసం పాటుపడే జగనన్నకు పెత్తందార్ల కోసం పాటుపడే చంద్రబాబుకు మధ్యే ప్రస్తుత పోటీ జరుగుతోందన్నారు. పేదవాడు తన ఓటుతో పచ్చబ్యాచ్‌కు వణుకు పుట్టించాలన్నారు. జగనన్నను, ఆయన బాటలో నడుస్తూ అన్నివేళలా అండగా నిలుస్తున్న తనను మరోమారు ఆశీర్వదించాలని మంత్రి రోజా ప్రజలను కోరారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న మంత్రిని స్థానికులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, సర్పంచ్ రోశమ్మ, నాయకులు భాస్కర్ రెడ్డి, నాయకులు గురు, హరి, వేలు, పాండియన్, బ్రహ్మానందం, నల్లాండి, వాసు, సోము, పెద్దమున స్వామి, సారకాయలు, దొరవేలు, శీను, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమవిద్య



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు ఉత్తమవిద్య అందుతోందని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, పార్టీ మండల కన్వీనర్ తులసియాదవ్ తెలిపారు. గురువారం ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, మాజీ హెచ్ఎం స్వామిరాజు అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సాయంతో నిర్మించిన సరస్వతి విగ్రహప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో మంచి పౌష్టికాహారం, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందిస్తుందని చెప్పారు. అలాగే అమ్మఒడి, నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక హోమం చేశారు.



సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న పూర్వవిద్యార్థులు

అభివృద్ధికి పట్టం కట్టండి



ఓవర్ హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



కొత్తపల్లెదళితవాడలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తపల్లె సచివాలయ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధికి నిరతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని కోరారు. తాను సమితి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వంతో పోరాటం చేసి, కొత్తపల్లె దళితవాడలో ఒక్కొక్కరికి నాలుగు సెంట్లు వంతున 147 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేసి, గ్రామానికి ఉచిత విద్యుత్ ఏర్పాటు చేశానని గుర్తు చేశారు. అలాగే అంబేడ్కర్ భావజాలాలతో అప్పటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖరరెడ్డితో కలసి భూ పోరాటం చేసి, రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన పేదలకు భూపంపిణీ చేశామన్నారు. సీఎంగా 14 సంవత్సరాలు అధికారంలో ఉంటూ వచ్చిన చంద్రబాబు ఏనాడైనా పేదలకు ఒక్క సెంటు ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయేమో చెప్పాలని నిలదీశారు. ప్రస్తుత ప్రభుత్వం 33 లక్షల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే, వాటిని శ్మశానాలతో పోల్చడమే కాకుండా అమరావతిలో 30 వేల మంది పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై కోర్టులో స్టే తీసుకొచ్చిన ఘనుడు చంద్రబాబు అన్నారు. అమరావతిలో ఒక కమ్మసామాజిక వర్గం మాత్రమే జీవించాలా? పేదలు జీవించకూడదా? అన్ని సూటిగా ప్రశ్నించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి పేదలకు అందుబాటులో మెరుగైన సేవలు అందిస్తున్నారని, అది ఓర్వలేని చంద్రబాబు అండ్‌కో వలంటీర్ల వ్యవస్థను తొలగిస్తామని చెప్పడం దారుణమన్నారు.

నాడు చంద్రబాబు అమరావతిలో 125 అడుగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని, ముళ్ల పొదలు ఉన్న స్థలాన్ని కేటాయించి దళితుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశాడన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డులో కనక దుర్గమ్మ పాదాల చెంత ప్రపంచంలోనే ఎక్కడలేని విధంగా అతి ఎత్తైన 208 అడుగుల విగ్రహాన్ని రూ.400 కోట్ల వ్యయ్యంతో స్థాపించి దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడిన మహానుభావుడు అయ్యాడని చెప్పారు. చంద్రబాబుకు అధికారం ఇస్తే మళ్లీ కరువుకు అహ్వానం పలికినట్లేనని చెప్పారు. తాము ఎక్కడైనా అవినీతి చేసినట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేసి ప్రజల సమక్షంలోనే ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమేనన్నారు. కొత్తపల్లె అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు యాకోబ్ తమ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎంను ఈ సందర్భంగా కోరగా స్పందించిన మంత్రి తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొటార్లపల్లెలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఓవర్ హెడ్ ట్యాంకు, పాల శీతలీకరణ కేంద్రం, 49 కొత్తపల్లెమిట్టలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, సీసీ రోడ్డు, డ్రైనేజీలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో వినాయకస్వామి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, సర్పంచ్ ఢిల్లెయ్య, డీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, మాజీ సర్పంచ్ విజయబాబు, ఎంపీటీసీ సభ్యురాలు సుజాత, ఏఎంసీ డైరెక్టర్ గోవింద రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఏసయ్య, నాయకులు జనార్దన్, సుధ, పవన్, సీకేబాబు, యుగంధర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు గర్వపడేలా జగనన్న పాలన



మాట్లాడుతున్న మంత్రి రోజా

నిండ్ర : తాము ఆంధ్రప్రదేశ్ వారంటూ ప్రజలు గర్వంగా చెప్పుకునేలా సీఎం జగనన్న పాలన ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రం నిండ్రలో ఏర్పాటు చేసిన సిద్ధం సభలో పాల్గొన్నారు. అలాగే ఆమె నిండ్ర యువత కోసం రూ.26.84 లక్షలతో నిర్మించే జిమ్‌కు భూమిపూజ చేశారు. అనంతరం నేను సిద్ధం.. నా బూత్ సిద్ధం సభలో ఆమె మాట్లాడుతూ నిండ్రలో ఫ్యాక్టరీ తెప్పించి ఎందరో మహిళలకు ఉద్యోగాలు ఇప్పించామన్నారు. చారిత్రక వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల ప్రజలు తక్కువ ఖర్చుతో వివాహాలు జరిపించుకోవడానికి బుగ్గ అగ్రహారంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తున్నామని తెలిపారు. నిండ్రలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి, మంత్రి భర్త సెల్వమణి, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, దుర్గాదేవి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, పార్టీ జిల్లా కార్యదర్శి మేరి, మండల కన్వీనర్ వేణురాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ విజేష్, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు అనిల్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దామోదరం, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆదరించండి



విజయపురం : చేయూత చెక్కును మహిళలకు పంపిణీ చేస్తున్న మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి

విజయపురం : గత ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ వందశాంత సీఎం జగనన్న నెరవేర్చారని, ఈ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయపురం మండల కేంద్రంలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత మెగా చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగనన్న మహిళల పేరిటే అన్ని పథకాలు ఇస్తున్నారని, అందుకే వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మీరంతా అండగా నిలవాలని, నగరిలో మంత్రి రోజాను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయంతోనే మహిళలకు గుర్తింపు

- రూ.12.50 లక్షలతో నిర్మించిన డిజిటల్ సెమినార్ హాల్ ప్రారంభం
- రూ.2.20 లక్షల విలువైన కుట్టు మెషిన్లు పంపిణీలో మంత్రి ఆర్కే రోజా



కుట్టు మెషిన్లను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: ఒక్క విజయంతోనే మహిళలకు గుర్తింపు వస్తుందని, ఆ దిశగా ప్రతి విద్యార్థినీ ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు కృషి చేయాలని మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోజా చారిటబుల్ ట్రస్ట్ రూ.12.50 లక్షలతో నిర్మించిన డిజిటల్ సెమినార్ హాల్‌ను, అలాగే ట్రస్ట్ సౌజన్యంతో కళాశాలకు రూ.2.20 లక్షల విలువైన కుట్టు మెషిన్లను అందజేసి మంత్రి ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, గతంలో మహిళలకు విద్య అనేది అందని ద్రాక్షలా ఉండేదని, ఇప్పుడు జగనన్న పాలనలో మహిళలకు విద్య చేరువైందన్నారు. పురుషాధ్యిక సమాజంలో మహిళలు సమాన హక్కులు సాధించాలంటే విద్య ఒక్కటే సరైన మార్గమన్నారు. అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతున్న వారిలో ఎంత మంది మహిళలు ఉన్నారో తెలుసుకొంటే మహిళా శక్తి ఏపాటిదో అందరికీ అర్థం అవుతుందన్నారు. తాను ఇంటర్ చదువుతుండగా సినిమా అవకాశాలు రావడంతో చదువుకోలేకపోయానని, అయితే తన కోరికను కుమార్తె తీరుస్తోందన్నారు. అలాగే పేద పిల్లలైన పుష్ప, హమీద్‌ను మెడిసిన్ చదివిస్తున్నట్లు తెలిపారు. మనం ఏరంగంలో ఉన్నా మనల్ని టార్గెట్ చేసి మాట్లాడుతున్నారంటే మనం సక్సెస్ అయినట్లేనని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహులు, మహిళా సాధికార విభాగం కో–ఆర్డినేటర్ శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్, సచివాలయ కన్వీనర్ ఏకాంబరం, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



బాధితుడికి ట్రైసైకిల్ అందిస్తున్న సర్పంచ్ మురళీయాదవ్

పుత్తూరు: పేదలకు తనవంతు సాయం అందించడంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పుత్తూరు మండలం ఎగువ గూళూరు దళితవాడకు చెందిన ఏ.సుబ్రమణ్యం అనే వ్యక్తికి కుడి కాలు పూర్తిగా లేదు. దివ్యాంగుడి ఇబ్బందిని శిరుగురాజుపాళెం సర్పంచ్ మురళీయాదవ్ మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి ట్రైసైకిల్‌ను సర్పంచ్ ద్వారా బాధితుడికి అందజేశారు. సుబ్రమణ్యం కుటుంబం మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

సొంతగూటిలో సామాజిక పోరు

- బ్యానర్లు చించుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై నింద
- తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహానికి దగ్ధమైన బేకరీ



మేనాటంపల్లె వద్ద వర్గ పోరుతో తెలుగు తమ్ముళ్లు చింపిన బ్యానర్



ఎస్ఎస్ కొండ వద్ద తెలుగు తముళ్ల అత్యుత్సాహానికి దగ్ధమవుతున్న బేకరి

కార్వేటినగరం: తెలుగుదేశం పార్టీ సొంతగూటిలో సామాజిక పోరు తారస్థాయికి చేరుకుంటోంది. బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం గంగాధరనెల్లూరు మండలంలోని వింజం, బాలగంగనపల్లె పంచాయతీ సమీపంలో మేనాటంపల్లె వద్ద టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే తమ ఫొటోలు లేవంటూ కొందరు తెలుగు తమ్ముళ్లు వాటిని ధ్వంసం చేయడంతోపాటు ఆ ఫెక్సీల చిత్రాలను వాట్సాప్, ఫేస్‌బుక్‌లో నుంచి తీసుకోవడంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసింది. బ్యానర్లు వారే చింపుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై నెట్టి గొడవలు సృష్టించేందుకు యత్నించారు. పోలీసులు జోక్యం చేసుకోవడంతో..అది గుర్తు తెలియని వ్యక్తుల పని అని ప్లేటు ఫిరాయించారు. థామస్, చిట్టిబాబుల మధ్య చోటుచేసుకున్న సామాజిక వర్గ పోరును చూసి సీనియర్ నాయకులు కొందరు పార్టీకి దూరమయ్యారు. ఇక, ఎస్ఎస్ కొండ వద్ద తెలుగు తమ్ముళ్లు టీడీపీ తోరణాలు కట్టేందుకు చూపిన అత్యుత్సాహానికి ఒక బేకరి దగ్ధమైంది. అలాగే కాంప్లెక్స్‌లో రెండు షాపులు పాక్షికంగా కాలిపోయి ఆస్తినష్టం సంభవించింది. ఇక, గ్రామాల్లో టీడీపీ సానుభూతిపరులకే కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నాయకులు తమ పార్టీలో చేరినట్లు ప్రకటిస్తుండడంతో జనం ×ఇదే ఖర్మరా బాబూ అని నవ్వుకుంటున్నారు.

కనుమరుగవుతున్న మంచి లక్షణాలు

- మధ్యతరగతి కుటుంబాలు తన పాత్రను పోషించట్లేదు
- ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

తిరుపతి కల్చరల్: పందొమ్మిదవ శతాబ్దంలో సామాజిక మార్పు కోసం కృషిచేసిన మధ్యతరగతి వర్గం, ఇవాళ ఆ పాత్రను నిర్వహించలేకపోతోందని ప్రముఖ చరిత్రకారులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. నేడు మధ్యతరగతి కుటుంబాల్లో ఉండాల్సిన మంచి లక్షణాలు చాలావరకు కనుమరుగయ్యాయని తెలిపారు. 'తెలుగు సమాజం–ఆధునీకత' అనే అంశంపై తిరుపతి జిల్లా పౌరచైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో ముఖ్యవక్తగా ఆయన ప్రసంగించారు. ఆంగ్లేయుల పాలనలో ప్రవేశపెట్టిన జమిందారీ, రైత్వారీ వ్యవస్థలు అంతకు ముందున్న వ్యవస్థల కంటే కొంచెం మెరుగైనవే అయినా, బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం వాటిని ఏర్పాటు చేశారని, ఆంగ్ల విద్య కూడా అలాంటిదేనని వివరించారు. ఆంగ్లేయుల పాలనలో ఎంత నష్టం జరిగిందో అంతే మంచి జరిగిందన్న విషయం మరిచిపోకూడదని ఆయన గుర్తు చేశారు. ఆధునిక కాలంలో నూతనంగా ఏర్పడిన మధ్యతరగతి వర్గం చాలా చరిత్రాత్మక పాత్ర నిర్వహించిందని, నేడు ఆ పాత్రను నిర్వహించలేకపోతోందని, ఒక మేరకు అవినీతికి ఎలా అలవాటుపడిందో కూడా వకుళాభరణం వివరించారు. కులం ఉన్నంత కాలం ఈ దేశం బాగుపడదని అంబేడ్కర్ అన్న విషయాన్ని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఒక స్వాప్నికుడని, కేవలం దళితుల కోసం మాత్రమే పాటుపడలేదని, దళితులు సమాజంలో భాగం కనుక మొత్తం సమాజ అభ్యున్నతి కోసం పాటు పడ్డారని అన్నారు. పౌరచైతన్య వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షుడు వాకాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అనేక మంది వేసిన ప్రశ్నలకు వకుళాభరణం రామకృష్ణ సమాధానాలు చెప్పారు. పౌరచైతన్య వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవ శర్మ, ప్రధాన కార్యదర్శి కుమార్ రెడ్డి, కోశాధికారి హరీష్, వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.